# మహిమ



తిరుపతి వెంకటేశ్వర స్వామి మొక్కులు అలా అలా పెరిగిపోతున్నాయి.

రామారావు కుటుంబంతో ప్రయాణమై వెళ్లి కొండమీద కాటేజి ఒకటి తీసుకున్నాడు. సామాన్లు ఎక్కడివక్కడ పడేసి స్నానానికి వెళ్లాడు రామారావు.

ఇల్లు ఊడుస్తున్నప్పుడు డ్రాయరున్న గదిలోకి పనివాడు వెళ్లేసరికి, భర్త బల్లమీద డబ్బుని ఉంచిన విషయం రాజ్యలక్ష్మికి జ్ఞాపకం వచ్చి వాడిని ఓ కంట కనిపెట్టూనే తన పని చేసుకోసాగింది.

వాడు ఆ గది ఊడ్చి బయటకి వచ్చాక- "అమ్మా! బల్లమీద డబ్బులు ఉంచారు. మరిచిపోయినట్లున్నారు. ఇక్కడ ఇలా ఉంచినా పర్వాలేదు. తలుపులకి తాళాలు వేయక పోయినా పర్వాలేదు. పైసా పోదు. కానీ.., కొండ దిగాక మాత్రం జాగ్రత్తగా ఉండండి. తెలియకుండానే దొంగతనాలు చేస్తారు" అన్నాడు.

అప్పుడే స్నానంచేసి వస్తున్న రామారావు ఆ మాటలు విని ఆగాడు.

"అవునమ్మా ... ఈ కొండ మీద స్వామి మహిమే అంత! మీరు సామానే కాదు.., డబ్బూ, నగలూ అయినా సరే- ఇక్కడ వదిలిపెట్టి తలుపులు తీసిపోండి. ఎవ్వరూ ముట్టుకోరు. ఎవరికీ దొంగతనం చేయాలనే బుద్ధే పుట్టదు. ఒకవేళ ఎవరైనా చేసినా, వాళ్ళకి వెంటనే తీరని కష్టం వస్తుంది. క్షణాలమీద వాళ్ళు లెంపలు వేసుకుని, దొంగిలించిన సొమ్ము వెంటనే తిరిగి ఇచ్చేస్తారు. ఇలా ఎన్నోసార్లు జరగడంతో, ఎవరికీ కొండపైన దొంగతనం చేసే ధైర్యం లేకుండాపోయింది. రోజూ ఇన్ని వేలమంది భక్తులు కొండపైకి వస్తుంటారు కదా! ఒక్క దొంగతనం జరిగినట్లు ఎప్పుడైనా విన్నారా? పేపర్లో చూశారా?" అంటూ ఏకధాటిన చెప్పుకుపోయాడు.

స్నానాలూ అవీ పూర్తి చేసుకుని, దైవ దర్శనానికి సకుటుంబంగా బయలుదేరాడు రామారావు. ఇంచుమించు గుడి దగ్గరకి వచ్చేసరికి, "ఏమండీ... తలుపుకి తాళం వేశారా?" అని అడిగింది రాజ్యలక్ష్మి.

"లేదు. నువ్వు వేశావనుకున్నాను. తాళం నీ దగ్గరే ఉందిగా!" అన్నాడు రామారావు.

"అరే... నేను తీసుకోలేదండి. మరి ఏమైనట్లు?" ఆందోళన పడింది ఆమె.

"అమ్మా... తాళాన్ని నేను కిటికీలో పెట్టాను" అంది పెద్ద కూతురు మాధవి.

"అయితే... వెళ్లి తాళం వేసివద్దాం... రండి!" అంది రాజ్యలక్ష్మి.

"పర్వాలేదులే. ఇప్పుడు మళ్లీ వెళ్లి వచ్చామంటే, క్యూలో ఇంకా వెనక్కిపోవాల్సి వస్తుంది" అన్నాడు రామారావు.

దైవదర్శనం చేసుకుని తీరికగా గదికి చేరుకున్నారు వాళ్ళు.

దగ్గరగా వేసిన తలుపులు అలాగే ఉన్నాయి. పెట్టె, బెడ్డింగూ అన్నీ ఉన్నచోటే ఉన్నాయి. ఎటొచ్చీ... భోజనం కోసం తెచ్చుకొన్న పెద్ద స్టీల్ టిఫెన్ క్యారియరూ, రామారావు విడిచిన ఖరీదైన టెర్లిన్ బట్టలూ, 50 రూపాయలున్న రాజ్యలక్ష్మి పర్సూ మాత్రం కనిపించలేదు.

– చతుర... ఫిబ్రవరి '79